సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 12 । నవంబర్ । 2024



రూ.1,00,116 విరాళం


సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహుని నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50,116, నిత్యాభిషేకానికి రూ.50 వేల చొప్పున ఆకుల త్రిమూర్తులు (అమలాపురం) విరాళం అందజేశారు.

సత్యదేవునికి ముత్యాల హారం



అన్నవరం: సత్యదేవునికి రూ.2 లక్షల విలువైన 20 గ్రాముల బంగారం, 29 గ్రాముల ముత్యాలతో చేయించిన హారాన్ని టి.అనిల్ కుమార్ (హైదరాబాద్) సమర్పించారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 44,537 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 800, మధ్య డెల్టాకు వెయ్యి, పశ్చిమ డెల్టాకు 3,500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.50 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

పోలీస్ గ్రీవెన్స్‌కు 27 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 27 అర్జీలు వచ్చాయి. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు నిర్వహించిన ఈ గ్రీవెన్స్‌కు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అర్జీదారులు వచ్చి తమ సమస్యలను ఏకరవు పెట్టారు. వచ్చిన అర్జీలను నిర్దీత సమయంలో పరిష్కరించి ఫిర్యాదుదారులకు భరోసాగా నిలవాలని ఎస్పీ ఆయా ప్రాంతాల సీఐలు, ఎస్సైలను ఆదేశించారు. వచ్చిన అర్జీల్లో ఎక్కువగా ఆస్తి తగాదాలు, కుటుంబ వివాదాలే ఉన్నారు. వాటి పరిష్కారాలకు కూడా ఎస్పీ ఆయా ప్రాంతాల పోలీసు అధికారులతో మాట్లాడి సమస్య తీవ్రతపై చర్చించారు.


కొబ్బరి తోటలో శివలింగం

పూజలు చేసిన భక్తులు



బోడపాటివారిపాలెంలో శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

పి.గన్నవరం: గ్రామ శివారు బోడపాటివారి పాలెం కొండాలమ్మ ఆలయం వెనుక కొబ్బరి తోటలో సోమవారం చిన్న శివలింగం దర్శనమివ్వడంతో గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేశారు. సోమవారం ఉదయం ఆలయం వెనుక ఒక భక్తురాలికి నాగు పాము కనిపించింది. ఆమె పామును గమనిస్తున్న సమయంలో పక్కనే ఒక శివలింగం మెరుస్తూ కనిపించింది. ఈ విషయాన్ని గ్రామస్తులకు చెప్పడంతో వారు అక్కడికి వచ్చి పూజలు చేశారు. ఇది పంచలోహ శివలింగం అని ప్రజలు తెలిపారు.



శివలింగం

ఇండియన్ పోస్టల్ పేమెంట్ ఖాతాలకు చర్యలు



మురమళ్ల సబ్ పోస్టాఫీస్‌ను ప్రారంభిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్

ఐ.పోలవరం: రాష్ట్రంలో 64 లక్షల మందికి ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు ఖాతాలు ప్రారంభించినట్లు అమలాపురం పోస్టల్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ అన్నారు. మురమళ్ల బ్రాంచ్ పోస్టాఫీస్‌ను సబ్ పోస్టాఫీస్‌గా అప్‌గ్రేడ్ చేశారు. ఈ నూతన కార్యాలయాన్ని అమలాపురం పోస్టల్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకింగ్ సేవలను పోస్ట్ ఆఫీస్‌ల ద్వారా ఖాతాదారులకు అందించేందుకు ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు ఖాతాలు ప్రారంభించినట్లు తెలిపారు. అమలాపురం హెడ్ పోస్టాఫీస్ ఆధ్వర్యంలో వారం రోజుల నుంచి ఐపీపీబీ ఖాతాలు ప్రారంభించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పోస్టాఫీస్‌ల ద్వారా మరిన్ని సేవలు ఖాతాదారులకు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అమలాపురం హెడ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలో ఇప్పటి వరకూ నాలుగు వేల మంది ఐపీపీబీ ఖాతాలు ప్రారంభించారన్నారు. అలాగే ఆధార్ అనుసంధానం, పాస్‌పోర్ట్, రైల్వే టిక్కెట్ల బుకింగ్‌తోపాటు ఇతర బ్యాంకులో ఉన్న నగదును ఐపీపీబీ అకౌంట్ ద్వారా వేలిముద్ర సాయంతో ఖాతాదారులు తీసుకోవచ్చన్నారు. మురమళ్ల గ్రామానికి చెందిన నూలు వెంకటేశ్వరరావుకు ఐపీపీబీ ఖాతా ప్రారంభించి మురమళ్ల సబ్ పోస్ట్ ఆఫీస్ ద్వారా లావాదేవీలను పోస్టల్ సూపరింటెండెంట్ ప్రారంభించారు. సర్పంచ్ కాలే రాజబాబు, అడిషనల్ పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీధర్, సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ వంశీ, ఎస్పీ ఎం.రామ్మూర్తి, పోస్టల్ సిబ్బంది మాగాపు బాబ్జీ, బసవ వరహాలు తదితరులు పాల్గొన్నారు.

కేటాయింపు లేని బడ్జెట్



- రాష్ట్ర బడ్జెట్‌పై అన్నివర్గాల పెదవి విరుపు
- రైతులు, యువత, మహిళల్లో నిరాశ
- బడుగు, బలహీన వర్గాల్లో అసంతృప్తి
- డెల్టాకు రూ.52.62 కోట్లే కేటాయింపు
- బాబు, పవన్ హామీలకు మొండిచేయి

సాక్షి, అమలాపురం: ఎన్నికల ముందు ఓటర్లకు అరచేతిలో వైకుంఠం చూపడం.. ఎన్నికల తరువాత నమ్మిన ప్రజలను గాలికి వదిలేయడం సీఎం చంద్రబాబు నైజం. తాజాగా అదే పనిచేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుపై ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయింపులు చూడకుండా పథకాలను గాలిలో పెట్టారు. అన్ని పథకాలు అమలు చేస్తామన్నారే కాని, నిర్దిష్టమైన కేటాయింపులు చేయలేదు. అలాగే ఎన్నికల ప్రచార సభల్లో కీలకమైన గోదావరి డెల్టా ఆధునీకరణకు కట్టుబడి ఉన్నామని చెప్పిన చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు తాజాగా బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు చేసి చేతులు దులుపుకోవడం ద్వారా రైతుల ఆశలపై నీళ్లు జల్లారు.

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఐదు నెలల తరువాత బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో ఆయా ప్రభుత్వ శాఖలకు కేటాయించిన నిధులతోపాటు సూపర్ సిక్స్ పథకాలకు అదనంగా నిధులు కేటాయిస్తారని పథకాల లబ్ధిదారులు వేయి కళ్లతో ఎదురు చూశారు. కేటాయింపులపై భారీగా ఆశలు పెట్టుకున్న రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, మధ్యతరగతి ప్రజలు బడ్జెట్ చూసి నిరుత్సాహానికి గురయ్యారు. గత ప్రభుత్వం కేటాయించిన కేటాయింపులనే అంకెలు మార్పులు చేసి చూపించారే తప్ప పథకాల అమలుకు అవసరమైన నిధులు బడ్జెట్‌లో కేటాయించలేదని వారు వాపోతున్నారు.

- రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఎప్పుడు ఇచ్చేది వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించలేదు. ఈ పథకానికి రూ.పది వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా, బడ్జెట్‌లో రూ.4,500 కోట్లు మాత్రమే చూపించారు. ఖరీఫ్ సాగు భారీ వర్షాలకు దెబ్బ తింది. పంట దిగుబడి లేదు. పెట్టుబడులు వస్తే గొప్ప అన్నట్టుగా ఉంది. దీంతో రైతులు రబీ పెట్టుబడులకు అప్పులు చేయాల్సిన దుస్థితి. కాని కూటమి ప్రభుత్వం రబీ సాగు సమయానికి పెట్టుబడి సాయం ఇచ్చే పరిస్థితుల్లో లేదు. ఈ సమయంలో తమకు చంద్రబాబు ఇస్తానన్న పెట్టుబడి సాయం ఇవ్వాలని లబ్ధిదారులైన సుమారు 1.45 లక్షల మంది రైతులు ఎదురు చూస్తున్నారు.
- మహిళలకు బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం షాక్ ఇచ్చింది. మహాశక్తి పథకానికి 19 నుంచి 59 ఏళ్ల మహిళలకు సాయం చేస్తామని, నెలకు రూ.1,500 ఆర్థిక సాయం చేస్తామని ఎన్నికల్లో చెప్పింది. అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామన్న చంద్రబాబు ఇప్పటి వరకూ ఇవ్వ లేదు. ఈ ఏడాది ఇవ్వాల్సిన రూ.18 వేలు అందకుండా పోతోందని లబ్ధి పొందాల్సిన సుమారు 6.03 లక్షల మంది మహిళలు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది ఇవ్వాల్సిన మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లలో రెండు ఎత్తివేశారు. దీనివల్ల సుమారు 2.43 లక్షల మంది లబ్ధిదారులు రెండు ఉచిత సిలిండర్లు పొందలేకపోయారు.
- పాఠశాల స్థాయిలో ఎంత మంది ఉంటే అంత విద్యార్థులకు తల్లికి వందనం పేరుతో అంతమందికి రూ.15 వేల చొప్పున ఇస్తామని చెప్పారు. కాని ఎప్పటి నుంచి అనేది చెప్పలేదు. సుమారు 1.68 లక్షల మంది వరకూ ఆశగా చూస్తున్నారు.
- బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి ఊసేలేదు. దీనికోసం సుమారు 4.80 లక్షల మంది నిరీక్షిస్తున్నారు.



డెల్టాకు అరకొర కేటాయింపులు

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకొల్లు నియోజకవర్గం గోదావరి డెల్టా పరిధిలోనే ఉంది. కానీ డెల్టా ఆధునీకరణకు కేటాయించింది కేవలం రూ.52.62 కోట్లు మాత్రమే. గోదావరి జిల్లాలో చంద్రబాబు 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ' సభల్లో.. పవన్ కళ్యాణ్ వారాహి సభల్లో మురుగునీటి కాలువలు, పంట కాలువలను ఆధునీకరిస్తామని హామీల వర్షం కురిపించారు. కానీ బడ్జెట్‌లో మాత్రం కేవలం రూ.52.62 కోట్లు ఇవ్వడం రైతులను నిరాశకు గురి చేసింది. కృష్ణా డెల్టాకు రూ.138.76 కోట్లు ఇచ్చిన ప్రభుత్వం గోదావరి డెల్టాకు అందులో సగం కూడా కేటాయించలేదు. ఈ నిధులతో ఆధునీకరణ అటుంచి కనీస మరమ్మతులు కూడా చేయలేరని రైతులు వాపోతున్నారు.

కనీసం మరమ్మతులు చేయలేరు



గోదావరి డెల్టా ఆధునీకరిస్తామని, ముంపు నీరు దిగేలా చర్యలు తీసుకుంటామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీ ఇచ్చారు. అయితే బడ్జెట్‌లో మాత్రం కేవలం తక్కువ నిధులు కేటాయించడం వల్ల ఫలితం ఉండదు. ఈ నిధులతో కనీస మరమ్మతులు కూడా చేయలేరు. రూ.500 కోట్లు కేటాయిస్తే కనీసం బేసిన్ల వారీగా ఆధునీకరణ పనులు చేసే అవకాశముంటోంది.

–కొవ్వూరి త్రినాథ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రామచంద్రపురం

నెరవేర్చే ఆలోచన ఎక్కడ!



ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో ఓటర్లను మభ్యపెట్టిన కూటమి పార్టీలు, అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీలు నెరవేర్చడం లేదు. వారికి నెరవేర్చే ఆలోచన లేదని బడ్జెట్‌ను చూస్తే అర్థమవుతోంది. బడ్జెట్ కేటాయింపుల్లో కూడా వారు మహిళలను మభ్యపెట్టారు. నెలకు రూ.1,500 ఎప్పుడు ఇస్తారు? ఈ ఏడాది ఉచితంగా ఇవ్వాల్సిన రెండు సిలిండర్ల ప్రస్తావన ఏదీ?

– అంబటి భవానీ, ఎంపీపీ, రామచంద్రపురం

పీఆర్సీ ప్రస్తావించకపోవడం అన్యాయం



డాక్టర్ డీఎస్ కొఠారి కమిషన్ సూచనల ప్రకారం విద్యకు బడ్జెట్లో 30 శాతం కేటాయింపులు చేయాలి. కానీ ఈ ప్రభుత్వం కేవలం 9.8 శాతం కేటాయించడం దారుణం. పీఆర్సీ గురించి ఎక్కడా ప్రస్తావించకపోవడం అన్యాయం. నాడు–నేడు పనులు పూర్తి కావడానికి ఎక్కడా కేటాయింపులు చేయలేదు.

–పెంకే వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు, యూటీఎఫ్, అమలాపురం

నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలి



లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తామన్నారు. లేదా నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన జూన్ నెల నుంచి మాకు రావాల్సిన నిరుద్యోగ భృతి నెలకు రూ.మూడు వేల చొప్పున వెంటనే విడుదల చేయాలి.

– సుంకర ప్రదీప్, పెదపట్నంలంక, మామిడికుదురు మండలం

హద్దుదాటి.. ఇసుక తరలింపేంటి!

- జోరుగా అక్రమ తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు

పి.గన్నవరం: ఉచిత ఇసుక మాటున అక్రమాలు హద్దు మీరాయి. కూటమి నేతల కనుసన్నల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. మండలంలో సీఆర్‌జెడ్ పరిధిలో తవ్వకాలు జరపకూడదనే నిబంధనలను సైతం బేఖాతరు చేసి ఇసుకాసురులు వ్యవహరిస్తున్నారు. బోట్స్‌మెన్ సొసైటీలకు ఉపాధి కల్పిస్తున్నామని చెబుతూ ఇసుక దందా సాగిస్తున్నారు. పి.గన్నవరం నియోజకవర్గ నేత ఆదేశాలతో మరికొన్ని చోట్ల కొత్త ర్యాంపులు ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. సీఆర్‌జెడ్ పరిధిలో పడవలపై నదీపాయలో ఇసుక తీస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ అనుమతులు లేకుండా స్థానిక పాత అక్విడెక్టు దిగువన వశిష్ట నదీపాయలో మూడు రోజులుగా నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతం సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్న నేపథ్యంలో నదిలో పడవలపై ఇసుక తీసేందుకు అనుమతి లేదు. దీనిని ఉల్లంఘిస్తూ పడవలపై ఇసుకను తీస్తున్నారు. పాత అక్విడెక్టుకు సమీపంలో ఈ ర్యాంపు ఉంది. ఈ కట్టడం భద్రత దృష్ట్యా దీనికి 500 మీటర్ల పరిధిలో ఇసుక తీయకూడదు. అయితే కొంతమంది బోట్ల నిర్వాహకులు అక్విడెక్టు సమీపంలో కూడా ఇసుక తీస్తున్నారు. ఈ ర్యాంపులో ట్రాక్టరు ఇసుకను రూ.1,400కు విక్రయిస్తున్నారు. అది స్థానికంగా ఉన్న వినియోగదారునికి చేరేసరికి రూ.2,500 అవుతోంది. పక్క గ్రామమైతే రూ.3,500కు పెరుగుతోంది. సోమవారం ఉదయం అధిక సంఖ్యలో ట్రాక్టర్లు రావడంతో ఇసుక లోడింగ్ విషయంలో డ్రైవర్ల మధ్య గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. అలాగే కె.ఏనుగుపల్లిలో కూటమి నేతల ఆధ్వర్యంలో నిబంధనలకు విరుద్ధంగా పడవలపై ఇసుక తీసి విక్రయిస్తున్నారు. ఎల్.గన్నవరం శివారు పుచ్చల్లంక సమీపంలో ర్యాంపు ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి.



పి.గన్నవరంలో ట్రాక్టర్లలో ఇసుక లోడింగ్

ర్యాంపు నిలిపివేశాం: తహసీల్దార్

నిబంధనలకు విరుద్ధంగా పడవలపై ఇసుక తీస్తుండటంతో పి.గన్నవరం పాత అక్విడెక్టు దిగువన బోట్స్‌మెన్ సొసైటీ ర్యాంపును సోమవారం నిలిపివేసినట్టు తహసీల్దార్ శ్రీపల్లవి తెలిపారు. కొత్త జీఓ ప్రకారం గోదావరి పరివాహక ప్రాంతాలను ఆనుకుని ఉన్న గ్రామాల్లో డైరెక్టు ర్యాంపుల నుంచి స్థానిక అవసరాలకు సచివాలయ అధికారుల అనుమతితో ట్రాక్టర్లపై తీసుకువెళ్లవచ్చన్నారు.

వాకర్స్ హెల్త్ క్లబ్‌లకు అవార్డుల పంట



అవార్డులతో అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్‌లకు అవార్డుల పంట పండింది. తునిలో ఆదివారం రాత్రి జరిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి సదస్సులో అమలాపురం క్లబ్‌లను మూడు అవార్డులు వరించాయి. వాకర్స్ హెల్త్ క్లబ్ (పురుషులు)లకు జిల్లా స్థాయి బెస్ట్ సర్వీసింగ్ అవార్డు, ఆ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్‌కు ఉత్తమ క్లబ్ అధ్యక్ష అవార్డు, అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షురాలు ఎస్.పద్మావతిలకు బెస్ట్ వుమెన్ ప్రెసిడెంట్ అవార్డు లభించింది. ఈ అవార్డులను అంతర్జాతీయ వాకర్స్ అధ్యక్షుడు మురళీ మోహనరావు, వాకర్స్ జిల్లా గవర్నర్ శివాజీ చేతుల మీదుగా అందుకున్నారు. అమలాపురంలో వాకర్స్ క్లబ్ ప్రతినిధులు సోమవారం అభినందన కార్యక్రమంలో అవార్డులు పొందిన క్లబ్‌ను, క్లబ్ అధ్యక్షుడు సత్య వరప్రసాద్, మహిళా క్లబ్ అధ్యక్షురాలు పద్మావతిలను ప్రశంసించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా సీనియర్ వాకర్లు డాక్టర్ బి.రాఘవేంద్రరావు, డాక్టర్ సీహెచ్ విష్ణుమూర్తి ముఖ్య అతిథులు పాల్గొని ప్రసంగించారు.

సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపండి



ముస్లిం పెద్దలను సత్కరిస్తున్న జేసీ నిషాంతి

జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం రూరల్: ప్రజా సమస్యలకు నాణ్యమైన పరిష్కార మార్గాలు చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం అమలాపురం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. జేసీ నిషాంతి, జిల్లా రెవెన్యూ అధికారి మదన మోహన్‌రావు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకర్ ప్రసాద్ అర్జీదారుల అర్జీదారుల నుంచి 198 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భం జేసీ మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో పారదర్శకత పాటించాలన్నారు. జిల్లా స్థాయి అధికారులు క్షేత్ర స్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. డీపీవో శాంతలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ కృష్ణారెడ్డి, డీఎస్ఓ ఉదయభాస్కర్, సీపీఓ వెంకటేశ్వర్లు జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సేవలు స్ఫూర్తిదాయకం

భారత తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాభివృద్ధికి అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని జేసీ నిషాంతి అన్నారు. కలెక్టరేట్‌లో మైనారిటీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆజాద్ జయంతిని నిర్వహించారు. తొలుత ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేసీ మాట్లాడుతూ తన దూరదృష్టితో విద్యా వ్యవస్థను పటిష్టం చేసిన ఘనత ఆజాద్‌కు దక్కుతుందన్నారు. ప్రాథమిక విద్యను ప్రోత్సహించడానికి పిల్లలను పాఠశాలల్లో చేర్పించడంపై అవగాహన కల్పించారన్నారు. అనంతరం మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముస్లిం మత పెద్దలను జేసీ సన్మానించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం బాషా, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి బి.వీరవేణి, ఉప విద్యాశాఖ అధికారి జి.సూర్యప్రకాశం పాల్గొన్నారు.

మింగ్యాస్‌తున్నారు...

- బ్లాక్ మార్కెట్‌కు ఎల్పీజీ గ్యాస్
- వ్యాపార అవసరాలకు డొమెస్టిక్ సిలిండర్లు
- పక్కదారి పడుతున్న రాయితీ

అలమూరు: అక్రమార్కులకు ఏదీ అనర్హం అన్నట్లు, సందు దొరికితే చాలు అందినకాడకు దోచుకుంటున్నారు.. ఎన్ని నిబంధనలున్నా వారు చెలరేగిపోతున్నారు.. కేంద్ర ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న ఎల్పీజీ గ్యాస్‌నూ పక్కదారి పట్టిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో డొమెస్టిక్ (గృహావసరాలు) సిలిండర్లకు, వాణిజ్య (కమర్షియల్) గ్యాస్‌కు ధరల్లో భారీ వ్యత్యాసం ఉండటంతో ఎల్పీజీ గ్యాస్ దారిమళ్లించి జేబులు నింపుకొంటున్నారు. గృహావసరాలకు మాత్రమే వినియోగించాల్సిన డొమెస్టిక్ సిలిండర్లు వ్యాపార అవసరాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు నష్టం మిగుల్చుతున్నారు. అక్రమ గ్యాస్ వినియోగాన్ని అరికట్టాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

ఏజెన్సీలు.. కనెక్షన్లు

జిల్లాలో మొత్తం 91 గ్యాస్ ఏజెన్సీలు ఉండగా, 6,57,452 మంది వినియోగదారులు ఉన్నాయి. ఇందులో కేంద్రం రాయితీపై అందిస్తున్న ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు 57,420 వరకూ ఉన్నాయి. జిల్లాలో నిత్యం ఆయా గ్యాస్ ఏజెన్సీల ద్వారా రోజుకు సుమారు 15 వేల డొమెస్టిక్ సిలిండర్లు వినియోగిస్తున్నట్లు అంచనా. 14.2 కిలోల డొమెస్టిక్ సిలిండర్‌ను కేంద్ర ప్రభుత్వం రాయితీపై రూ.831కు అందజేస్తుంది. అయితే సగటు వినియోగదారుడికి కిలో గ్యాస్ ధర రూ.58.52కు లభిస్తుంది. వాణిజ్య అవసరాలకు సంబంధించిన కమర్షియల్ సిలిండర్లకు ఈ రాయితీ వర్తించకపోవడంతో ధరలో భారీ పెరుగుదల కనబడుతుంది. 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.1,830 వరకూ ఉండగా, కిలో రూ. 96.33 అవుతోంది. డొమెస్టిక్, కమర్షియల్ సిలిండర్ల మధ్య కిలో గ్యాస్‌కు రూ.38.81 వరకూ వ్యత్యాసం ఉంది. డొమెస్టిక్ సిలిండర్ ద్వారా రూ.537 వరకూ తగ్గదల కనిపించడంతో పలు రెస్టారెంట్లు, హోటళ్లు, బేకరీలు తదితర యజమానులు గ్యాస్ దందాకు కారణమవుతున్నారు.



తోపుడు బండి వద్ద సంచి కప్పి వినియోగిస్తున్న డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్



డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్‌ను తీసుకు వెళుతున్న డెలివరీ బాయ్

చర్యలు లేక..

గృహావసరాల కోసం వినియోగించే ఎల్పీజీ గ్యాస్ పక్కదారి పడుతున్నా జిల్లా పౌరసరఫరాల, రెవెన్యూ శాఖల అధికారులు మాత్రం అక్రమార్కులపై చర్యలు తీసుకోవడం లేదు. కనీసం తనిఖీలు చేయడం లేదు. జిల్లాలో కార్పొరేట్ నుంచి వీధి వ్యాపారులు సుమారు ఆరు వేలకు పైగానే ఉన్నారు. గ్యాస్ విక్రయ దళారులు కొన్నిచోట్ల వ్యాపార సంస్థల వద్దకే వచ్చి డొమెస్టిక్ సిలిండర్లలోంచి ఒక పరికరం ద్వారా గ్యాస్‌ను వాణిజ్య సిలిండర్లలోకి రీఫిల్లింగ్ చేసి కమీషన్ తీసుకుంటున్నారు. అధికారులెవరైనా తనిఖీకి వెళ్లినా అక్కడ మాత్రం వాణిజ్య సిలిండర్లు కనిపిస్తాయి. దీంతో రీఫిల్లింగ్ ప్రక్రియ జిల్లాలో జోరుగా సాగుతుంది. జిల్లాలో వ్యాపార, వాణిజ్య అవసరాల నిమిత్తం రోజుకు సుమారు రెండు వేలకు పైగా వాణిజ్య సిలిండర్ల అవసరం ఉంటుంది.

అయితే 500 వరకూ మాత్రమే కమర్షియల్ సిలిండర్లు వాడుతున్నట్లు పౌరసరఫరాల శాఖ రికార్డులను బట్టి తెలుస్తోంది. మిగిలిన వ్యాపార అవసరాల గ్యాస్ వినియోగం అంతా డొమెస్టిక్ సిలిండర్లే అని చెప్పకనే అర్థమవుతోంది. దీనివల్ల రోజుకు సగటున సుమారు 1,500 డొమెస్టిక్ సిలిండర్ల దుర్వినియోగం జరిగి, ఒక్కో దానిపై రూ.537 చొప్పున లెక్క కడితే సగటున రూ.8.05 లక్షలు ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లుతుంది. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం తనిఖీలు తూతూ మంత్రంగా జరిపి చేతులు దులుపుకొంటున్నారు.

జిల్లాలో కనెక్షన్లు	6,57 452	గ్యాస్ ఏజెన్సీలు	91
జనరల్ కనెక్షన్లు	4,05,782	హెచ్‌పీ గ్యాస్	44
దీపం కనెక్షన్లు	1,84,183	ఇండేన్ గ్యాస్	33
ఉజ్వల కనెక్షన్లు	57,420	భారత్ గ్యాస్	14
సీఎస్ఆర్ కనషన్లు	9,872		
5 కేజీల కనెక్షన్లు	195		

అక్రమాలకు ఇదో మార్గం

ఎల్పీజీ గ్యాస్ కార్డు యజమానులకు గతంలో ఉన్న ఏడాదికి తొమ్మిది సిలిండర్ల సరఫరా పరిమితిని ఎత్తివేసి, నెలకు ఒకటి చొప్పున 12 సిలిండర్లను సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనలను మార్పు చేసింది. అయితే పేద, మధ్య తరగతి ప్రజలకు ఒక్కో సిలిండర్ రెండు నెలల నుంచి మూడు నెలల వరకూ సరిపోతుంది. కొన్ని కుటుంబాలకు నెలకు కేవలం నాలుగు నుంచి ఆరు వరకూ మాత్రమే సిలిండర్ల అవసరం ఉంటుంది. దీంతో గ్యాస్ విక్రయ దళారులు ఆ మిగిలిన సిలిండర్లను పక్కదారి పట్టిస్తున్నారు.

క్లుప్తంగా

బైక్‌ల చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

మామిడికుదురు: వ్యసనాలకు బానిసై బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్ చేశామని నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ సోమవారం తెలిపారు. జైలు నుంచి విడుదలై వచ్చి బైక్‌ల దొంగతనాలు చేస్తున్న అల్లవరం మండలం ఓడలరేవు గ్రామానికి చెందిన నల్లి బాలకృష్ణను అరెస్ట్ చేసి రాజోలు కోర్టుకు తరలించామని అన్నారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన బాలకృష్ణను అదుపులోకి తీసుకుని విచారించగా బైక్‌ల దొంగతనం ఘటనలు బయటపడ్డాయన్నారు. నగరం పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు, అమలాపురం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, పాలకొల్లు టౌన్ పరిధిలో ఒకటి చొప్పున బైక్‌లు చోరీ చేశాడన్నారు. ఆసుపత్రులు, ఖాళీ ప్రదేశాల్లో నిలిపిన వాహనాలను దొంగిలించేవాడన్నారు. రాజోలు పోలీస్ స్టేషన్‌లో 27 బైక్‌లు, అమలాపురం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 16 బైక్‌లు దొంగతనం చేసి గతంలో జైలుకు వెళ్లి వచ్చాడని ఎస్సై చైతన్యకుమార్ వివరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చోరీ కేసులో ఇద్దరు..



విలేకర్లకు వివరాలు తెలియజేస్తున్న సీఐ కృష్ణభగవాన్

సామర్లకోట: ఇటీవల వేట్లపాలెం గ్రామంలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన ఇద్దరిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ ఎ.కృష్ణభగవాన్ వెల్లడించారు. తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న కోనసీమ జిల్లాకు చెందిన జిల్లెల రాకేష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా, అదే జిల్లాకు చెందిన చావల కృష్ణ ఉన్నాడని చెప్పడంతో, ఇద్దరినీ అరెస్టు చేశామన్నారు. ఈ కేసును కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఛేదించామన్నారు. నిందితుల నుంచి 186.79 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీటి విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుందన్నారు. సమావేశంలో క్రైం సీఐ అంకబాబు, ఇతర సిబ్బంది ఉన్నారు.



మురమళ్ల వీరేశ్వర ఆలయంలో స్వామివారికి పంచామృత అభిషేకం చేస్తున్న అర్చకుడు



గోదావరిలో కార్తిక దీపం వదులుతున్న మహిళ



రాజమహేంద్రవరంలో రావిచెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ముక్కంటి... ప్రణమిల్లె జగతి

ముల్లోకాలను ఏలే ఆ ముక్కంటికి భక్తజనం ప్రణమిల్లింది.. ఓం నమఃశివాయ నామస్మరణ ప్రతి నోటా వేదమంత్రమైంది.. ఆ సర్వేశ్వరునికి ప్రీతికరమైన కార్తిక మాసం, అందులోనూ సోమవారం కావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాల్లో రద్దీ నెలకొంది. ఆయా ఆలయాల వద్ద, గోదావరి ఘాట్‌లలో కార్తిక దీపాలను వెలిగిస్తూ మహిళలు కనిపించారు. అనంతరం ఆ స్వామిని దర్శించుకున్నారు. రాజమహేంద్రవరంలోని పలు ఆలయాలు, మురమళ్ల వీరేశ్వరస్వామి, పిఠాపురం, సామర్లకోటలో పంచారామ క్షేత్రాలు, ఇలా ప్రతి ఆలయంలోనూ భక్తులు కిక్కిరిశారు.



పాదగయలో కుక్కుటేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు చేస్తున్న పురోహితులు



రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో స్నానమాచరిస్తున్న భక్తజన సందోహం



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయం బేడా మండపంలో అభిషేక పూజల్లో భక్తులు



పిఠాపురం పాదగయలో భక్తుల సందడి



పిఠాపురంలో కార్తిక దీపం చూపుతూ..

క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

గండేపల్లి: విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆదిత్య విద్యా సంస్థల ప్రిన్సిపాల్ ఆది రెడ్డి రమేష్ అన్నారు. సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో సోమవారం జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2024 పోటీలను ముఖ్య అతిథులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ గతంలో క్రీడల్లో రాణించిన ఎందరో వివిధ రంగాల్లో మంచి స్థాయిలో స్థిరపడ్డారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందారని, ఆదిత్య క్యాంపస్‌లో పదో సారి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జేఎన్‌టీయూకే స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ జి.శ్యామ్‌కుమార్, అంతర్జాతీయ అథ్లెటిక్స్ పీపీ వరప్రసాద్, రాష్ట్ర పీఈటీ అసోసియేషన్ నాయకుడు నూకరాజు హాజరయ్యారు. డీన్ వి.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవి, ఫిజికల్ డైరెక్టర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం జరిగిన పోటీల్లో విజేతలకు సతీష్‌రెడ్డి బహుమతులు అందజేశారు.



బెలూన్స్ వదిలి పోటీలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

కాకినాడ సిటీ: పూర్వపు తూర్పు– పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయుల నియోజకవర్గ ఆంధ్రప్రదేశ్ శాసనమండలికి సభ్యుని ఎన్నికకు చర్యలు తీసుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సోమవారం తెలిపారు. అభ్యర్థులు నామినేషన్ పత్రాలను ఈ నెల 18వ తేదీ దాటకుండా సెలవు రోజుల్లో తప్ప ఏ రోజైనా, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య రిటర్నింగ్ అధికారి కలెక్టర్ కార్యాలయంలో అందించవచ్చన్నారు. దీనికి సంబంధించిన నామినేషన్ పత్రాలు కలెక్టరేట్‌లో ఉన్నాయని అన్నారు. వాటిని ఈ నెల 19న ఉదయం 11 గంటల నుంచి కోర్టు హాలు, కలెక్టరేట్ వద్ద పరిశీలిస్తారన్నారు. 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోపు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చన్నారు. ఎన్నికకు పోటీ ఉంటే డిసెంబర్ 5వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య పోలింగ్ జరుగుతుందని కలెక్టర్ వివరించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బిక్కవోలు: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందడంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవికుమార్ తెలిపారు. బలభద్రపురం గ్రామానికి చెందిన బుంగా రాజేష్ (32) గ్రాసిం ఇండస్ట్రీలో పని చేస్తున్నాడు. ఎప్పటికి లాగే ఆదివారం రాత్రి బైక్‌పై ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి 11 గంటలు అవుతున్నా అతను రాకపోవడంతో భార్య ఝాన్సీరాణి ఫోన్ చేసింది. అతను బలభద్రపురం శివారులో పడి ఉన్నాడని తెలియడంతో వెంటనే తన కుటుంబ సభ్యులతో కలిసి ఘటనా స్థలానికి వెళ్లింది. గాయాలతో ఉన్న రాజేష్‌ను అనపర్తి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అతను మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అయితే తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయని, ఝాన్సీరాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.



మృతి చెందిన రాజేష్

లైంగిక దాడికి యత్నించిన నలుగురిపై కేసు

గోకవరం: మహిళపై లైంగిక దాకి యత్నించిన నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కృష్ణునిపాలెం సంజీవయ్యనగర్‌కు చెందిన మహిళ రాజమహేంద్రవరంలో పని చేస్తుంది. ఆదివారం రాత్రి పది గంటల సమయంలో రాజమహేంద్రవరం నుంచి గోకవరం వచ్చి కాలినడకన కృష్ణునిపాలెం వెళుతుండగా పెట్రోల్ బంకు ఎదురుగా షేక్ ఖన్నానజీర్ అనే యువకుడు దీపావళి సామాన్లు కాల్చుతున్నాడు. మహిళ ఒక్కరే నడిచి వెళ్లడాన్ని గుర్తించిన యువకుడు ఆమె నోరు నొక్కి లైంగిక దాడి చేయడానికి పెట్రోల్ బంకులోకి తీసుకు వెళ్లాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోని యువకులు అక్కడకు చేరుకుని మహిళను రక్షించారు. అలాగే యువకుడిని పట్టుకోవడానికి ప్రయత్నించగా అతని స్నేహితులు ముగ్గురు అక్కడి నుంచి తీసుకు వెళ్లిపోయారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు యువకుడితో పాటు సదరు ముగ్గురు యువకులను సోమవారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించారు. వీరు నలుగురు యువకులు రాజమహేంద్రవరంలో డిగ్రీ చదువుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటల్లో సూపర్‌వైజర్

- రాణిస్తున్న అన్నవరం దేవస్థానం ఉద్యోగిని
- ఆలయ ఛైర్మన్, ఈఓ అభినందన



వల్లూరి మాధవి

అన్నవరం: సాధించాలనే తపన ఉంటే ఏదైనా సొంతం చేసుకోవచ్చు.. బాధ్యతలు ఉన్నా ఆశయాన్ని నెరవేర్చుకోవచ్చు.. అచ్చం అలానే అన్నవరం దేవస్థానం ఉద్యోగిని వల్లూరి మాధవి ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ పోటీల్లో షాట్‌పుట్, వాలీబాల్‌లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో ఢిల్లీలో జరిగే 2024–25 జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ పోటీల్లో పాల్గొననున్నారు. దేవదాయ శాఖ నుంచి జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన ఏకైక క్రీడాకారిణి ఆమే కావడం విశేషం. ఆ వివరాల్లోకి వెళ్తే.. విద్యార్థి దశలోనే కాదు, ఉద్యోగిని అయ్యాక కూడా ఏ క్రీడలో పాల్గొన్నా పతకాలు సాధించిన ఘనత అన్నవరం దేవస్థానం వైద్యశాల ఫార్మసీ సూపర్‌వైజర్ వల్లూరి మాధవికు దక్కుతుంది. గతంలో జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకూ ఎన్నో క్రీడల్లో పాల్గొని ఆమె పతకాలు సాధించారు. ఈ నెల 6న గుంటూరు నాగార్జున యూనివర్సిటీ మైదానంలో జరిగిన అథ్లెటిక్స్ విభాగంలో షాట్‌పుట్ (45 ప్లస్ మహిళల విభాగం)లో ప్రథమ స్థానం పొందారు. ఈ నెల 9న విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన వాలీబాల్ మహిళల టీమ్‌లో విజేతగా నిలిచి జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ పోటీలకు ఎంపికయ్యారు. కాకినాడ ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో ఫార్మసీ చదివేటప్పటి నుంచి మాధవి 1995లో దేవస్థానం ఫార్మాసిస్ట్‌గా ఉద్యోగం పొందినప్పటికీ ఉద్యోగినిగా, వివాహం అయ్యాక గృహిణిగా తన బాధ్యతలు నెరవేరుస్తూనే క్రీడా పోటీల్లో రాణిస్తున్నారు. గతంలో అనేక పోటీల్లో పాల్గొని పతకాలు సాధించినట్లు ఆమె సోమవారం విలేకర్లకు వివరించారు.



గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో షాట్‌పుట్ విసురుతున్న మాధవి

విజయ ప్రస్థానం ఇదీ..

- మాధవి విద్యార్థి దశలో సుమారు 30 సార్లు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. ఫార్మసీ విద్యార్థినిగా వాలీబాల్ జాతీయ పోటీల్లో వరుసగా 1991లో బరంపురం, 1992లో భూపాల్, 1993లో పాట్నాలో ఆడారు.
- 2015లో కడప జిల్లా ప్రొద్దుటూరులో జరిగిన 35వ మాస్టర్ అథ్లెటిక్స్ మీట్‌లో మూడు స్వర్ణ పతకాలు, అనంతరం ఒంగోలులో జరిగిన ఎన్జీఓ క్రీడా పోటీల్లో నాలుగు పతకాలు సాధించారు.
- 2017 మార్చిలో మైసూర్‌లో జరిగిన జాతీయ స్థాయి ఎన్జీఓ క్రీడా పోటీలలో పాల్గొన్నారు. ఇంతవరకూ వివిధ పోటీల్లో పాల్గొని 60కి పైగా పతకాలు సాధించారు.
- 2018 జనవరి 7, 8, 9 తేదీల్లో గుంటూరులో జరిగిన 36వ ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్ మీట్‌లో మూడు పతకాలు పొందారు. షాట్‌పుట్, జావెలిన్‌త్రోలో స్వర్ణ, డిస్కస్‌త్రోలో రజత పతకాలు దక్కించుకున్నారు. జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ పోటీలకు ఎంపికైన ఆమెను అన్నవరం దేవస్థానం ఛైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ అభినందించారు.

లారీల ఢీ: డ్రైవర్ మృతి

దుద్దుకూరులో ఘటన

దేవరపల్లి: గుండుగొలను– కొవ్వూరు జాతీయ రహదారిపై దేవరపల్లి మండలం దుద్దుకూరు వద్ద సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇందులో తెలంగాణ రాష్ట్రం భద్రాచలానికి చెందిన డ్రైవర్ సరికొండ అనంతరాజు (50) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. దుద్దుకూరు వద్ద ఫ్లైఓవర్ దిగువలో రాజమహేంద్రవరం వైపు వెళుతున్న లారీ ముందు వెళుతున్న సెప్టిక్ ట్యాంకర్‌ను ఢీకొని సర్వీసు రోడ్డులోకి దూసుకు వెళ్లింది. అక్కడ టైర్ల దుకాణం వద్ద పంక్చర్ వేయించుకోవడానికి ఆగి ఉన్న ఐషర్ పార్సిల్ లారీని ఢీకొంది. దీంతో పార్సిల్ లారీ పక్కకు ఒరిగిపోగా, దీనిని ఢీకొన్న లారీ క్యాబిన్ పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ అనంతరాజు క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. అతన్ని బయటకు తీసేసరికి మృతి చెందినట్టు ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సెప్టిక్ ట్యాంకర్ అదుపు తప్పి పక్కకు వెళుతూ జియో ఖాళీ ట్యాంకర్‌ను ఢీకొనగా అది పాక్షికంగా దెబ్బతింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సుబ్రహ్మణ్యం వివరించారు.



ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ అనంతరాజు



దుద్దుకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ

వీధి కుక్క దాడి

వృద్ధుడి మృతి



అంగర సూర్యారావు (ఫైల్)

ఆలమూరు: వీధి కుక్క దాడిలో ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఆలమూరుకు చెందిన అంగర సూర్యారావు (72) తన వృత్తి రీత్యా పిండ ప్రదాన కార్యక్రమానికి కలవచర్ల వెళ్లారు. అక్కడ వీధి కుక్క దాడి చేసింది. అప్పటికే అధిక రక్తస్రావమైన సూర్యారావును స్థానికులు ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి సిఫారసు చేశారు. ఆటోలో వెళ్తుండగా సూర్యారావు మార్గ మధ్యంలోనే మృతి చెందాడు. వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ రాజు తెలిపారు. దీనిపై పంచాయతీరాజ్, పశుసంవర్ధక శాఖ, అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.